క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ప్రకాష్ బాబు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు అన్నారు. ఈ మేరకు శుక్రవారం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అతివేగం ప్రమాదకరమని, నిబంధనలను ఉల్లంగించిన ఎవ్వరూ వాహనాలు నడపరాదన్నారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పకుండా ధరించాలన్నారు. రైల్వేస్టేషన్ అనౌన్స్‌మెంట్ ద్వారా ప్రయాణికులను చైతన్య పరిచారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అభిరామ్, ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ సి.విశ్వనాథ్, పారాలీగల్ వలంటీర్లు, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

సౌండ్ సిస్టమ్ బహూకరణ



సౌండ్ సిస్టమ్ అందజేస్తున్న సింగర్స్ ఫ్రెండ్స్ సొసైటీ సభ్యులు

కడియం: వేమగిరి పంచాయతీ పరిధిలోని జక్కంపూడి నగర్ ప్రాథమిక పాఠశాలకు సింగర్స్ ఫ్రెండ్స్ సొసైటీ తరఫున రూ.16 వేలు విలువైన సౌండ్ సిస్టమ్‌ను అందజేశారు. ఈ మేరకు శుక్రవారం స్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్రహ్మణ్యానికి సొసైటీ ట్రెజరర్ యేరుకొండ వెంకటేష్ అందించారు. కార్యక్రమంలో సింగర్స్ ఫ్రెండ్స్ సొసైటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని 16వ డివిజన్ ఆవ వాంబే కాలనీకి చెందిన 16 ఏళ్ల కిలారి దివ్యమాలిక ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల సమయంలో మెడికల్ షాపునకు వెళ్లింది. కానీ ఎంతసేపటికీ ఇంటికి తిరిగి రాలేదు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాలలో వెతికినప్పటికీ కనిపించలేదు. దీంతో ఆమె అక్క శిరీష గురువారం రాత్రి బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై అంకారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనుషుల అక్రమ రవాణాను అరికట్టాలి

రాజమహేంద్రవరం సిటీ: మనుషుల అక్రమ రవాణాను నిరోధించడం అందరి బాధ్యత అని ఐసీడీఎస్ సూపర్ వైజర్ జి.అచ్చియమ్మ అన్నారు. స్థానిక సీడీపీఓ కార్యాలయంలో హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శుక్రవారం మనుషుల అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చియమ్మ మాట్లాడుతూ ఈ అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే అతి పెద్ద నేరంగా మారిందన్నారు. ప్రతిరోజు ఎంతో మంది యువతులు, మహిళలు దీని బారిన పడుతున్నారన్నారు. ముఖ్యంగా ఉద్యోగం, సినిమా అవకాశాల పేరుతో యువతకు మోసం చేసి, విదేశాలకు విక్రయిస్తున్నారన్నారు. సంస్థ కోఆర్డినేటర్ శ్రావ్య శృతి, సూపర్ వైజర్ నాగవేణి, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయపు పన్నుపై అవగాహన

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు ఆదాయపు పన్నుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌కం ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ ఎల్.రాజశేఖర్ మాట్లాడుతూ ఆదాయపు పన్ను రిటర్న్ ఎలా సమర్పించాలి, తప్పుడు రిఫండ్ క్లెయిమ్ చేస్తే తీసుకునే చట్టపరమైన చర్యలు, ఇబ్బందులను వివరించారు. కొత్త, పాత పద్ధతులతో చెల్లింపుల వల్ల కలిగే ప్రయోజనాలను తెలిపారు. ఇన్‌కం ట్యాక్స్ ఆఫీసర్ ఎస్.వీరబాబు, వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ రత్నకుమార్, కామర్స్ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి వి.సూరిబాబు, బి.వనజారత్నం తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సూపర్ వైజర్ శ్రీపద్మ

పెదపూడి: రాజ్యాంగం కల్పించిన చట్టాలపై బాలికలు, మహిళలు అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సంపర సెక్టార్ సూపర్ వైజర్ సీహెచ్ శ్రీపద్మ అన్నారు. సంపర జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు శుక్రవారం మిషన్ శక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా వంద రోజులు అవగాహన సదస్సులు నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా చట్టాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం త్రిమూర్తులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అటు చదువుతూ.. ఇటు గెలుస్తూ..

- చదువుతో పాటు ఆటలకు ప్రాధాన్యం
- సత్తా చాటుతున్న నగర క్రీడాకారులు
- పలు టోర్నీలలో పతకాల కైవసం



రోప్ స్కిప్పింగ్‌లో ప్రతిభ చూపిన యామినీదేవిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాఘవ కుమారి



ఇండో నేపాల్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించిన నాగపండు

ప్రకాశం నగర్: చదువులో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు దూసుకుపోతున్నారు. వివిధ పోటీలలో పాల్గొని తమ సత్తా చాటుతున్నారు. అనేక పతకాలు సాధించి, మిగిలిన వారికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ముఖ్యంగా నగరంలోని ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు విద్యార్థులు ఈ ఘనత సాధించి శభాష్ అనిపించుకుంటున్నారు. సాధారణ క్రీడలతో పాటు కరాటే, రోప్ స్కిప్పింగ్ తదితర వాటిల్లో ప్రతిభ చూపుతున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలలో పతకాలు సాధించడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా వేదికపై రాజమహేంద్రవరం ఖ్యాతిని పెంచుతున్నారు. ఇటీవల జరిగిన ఇండో నేపాల్ కరాటే చాంపియన్ షిప్ – 2024 పోటీల్లో దేశం తరఫున కరాటేలో 60 కేజీల అండర్ –22 విభాగంలో ఆర్ట్స్ కళాశాలకు చెందిన బి.నాగపండు బంగారు పతకం సాధించాడు. బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న అతడు పలు విభాగాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించాడు.

రోప్ స్కిప్పింగ్‌లో వెండి పతకం

భోపాల్‌లో ఇటీవల నిర్వహించిన ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ రోప్ స్కిప్పింగ్ జాతీయ స్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో కందుకూరి రాజ్యలక్ష్మి స్త్రీల కళాశాల విద్యార్థిని ఎ.యామినీ దేవి ప్రతిభ చూపి వెండి పతకం సాధించింది. భీమవరం డీఎన్‌ఆర్ కాలేజీలో నిర్వహించిన ఇంటర్ కొలాజియేట్ రోప్ స్కిప్పింగ్ సింగిల్ టచ్ పోటీల్లో పాల్గొన్న ఎం.నాగదేవి, ఏ.యామిని దేవి జాతీయ పోటీలకు ఎంపికవ్వగా, యామినీ దేవి ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకం సాధించింది. ఆ విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపాల్ పి.రాఘవ కుమారి అభినందించారు. గోవాలో జరిగిన జాతీయ స్థాయి స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీలోనూ రింక్ 5 రోడ్డు రేస్ విభాగంలో నగరానికి చెందిన కొండి లలిత్ వర్మ బంగారు పతకం, రింక్ 6 విభాగంలో రజిత పతకం సాధించాడు.

శిక్షణతో మంచి ఫలితాలు

క్రీడల్లో నైపుణ్యం సాధించడానికి క్రీడాకారులకు శిక్షణ చాలా అవసరం. అప్పుడు వారు వివిధ పోటీలలో ప్రతిభ చూపగలుగుతారు. ఇందుకోసం ప్రతి ఏటా వేసవి క్రీడా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా మే ఒకటి నుంచి 31 వరకూ దాదాపు నెల రోజుల పాటు నగరంలోని ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానం, స్టేడియం, ఎస్‌కేవీటీ క్రీడా మైదానం, లాలాచెరువు పోలీస్ గ్రౌండ్స్ వంటి వాటిలో క్రికెట్, ఫుట్ బాల్, బాస్కెట్ బాల్, యోగా, కరాటే వంటి వివిధ క్రీడల్లో శిక్షణ ఇచ్చారు. స్కూల్ గేమ్స్, ఆడుదాం ఆంధ్ర పేరుతో క్రీడా పోటీలను నిర్వహించి గ్రామీణా స్థాయిలో క్రీడాకారులను గుర్తించి మెరుగైన శిక్షణ ఇచ్చారు.

మిషన్ వాత్సల్య నిధుల విడుదల

రాజమహేంద్రవరం సిటీ: మిషన్ వాత్సల్య పథకం ద్వారా ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలోని 368 మంది పిల్లలకు రూ.88.32 లక్షల ఆర్థిక చేయూత అందిస్తున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. తన చాంబర్‌లో శుక్రవారం మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2023 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకూ ఆరు నెలలకు ఈ సొమ్ములు విడుదల చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం మిషన్ వాత్సల్య పథకం కింద పూర్తి, పాక్షిక నిరాదరణకు గురైన పిల్లలకు, ఎయిడ్స్ బాధిత తల్లితండ్రుల పిల్లలకు ప్రతి నెలా రూ.నాలుగు వేలు చొప్పున రెండేళ్ల పాటు ఆర్థిక సాయం అందజేస్తోందన్నారు.

డిజిటల్ బోధనపై అవగాహన

కంబాలచెరువు: శిక్షా సప్తాహ్‌లో భాగంగా స్థానిక నాగరాజా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం డిజిటల్ వనరుల వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయురాలు మోటూరి మంగారాణి మాట్లాడుతూ 21వ శతాబ్దపు బోధనకు డిజిటల్ వనరుల వినియోగం తప్పనిసరి అన్నారు. స్కూలులోని డిజిటల్ వనరుల స్థితిని నిర్ధారించుకుని, వాటిని వినియోగంలోకి తీసుకురావడం ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు.

పునరావాస కేంద్రాలలో అన్ని వసతులు



పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: పునరావాస కేంద్రాలను సక్రమంగా నిర్వహించి, వరద బాధితులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. వరద బాధితులను పునరావాస కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అక్కడి బాధితులతో మాట్లాడి, వసతుల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గోదావరి మధ్యలోని లంకల్లో ఉంటున్న 250 మందికి ఆల్కాట్ గార్డెన్స్‌లోని నగరపాలక సంస్థ కల్యాణ మండపంలో, మరో 198 మందికి చందా సత్రంలోనూ పునరావాసం కల్పించామన్నారు. వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలతో పాటు సాయంత్రం స్నాక్స్ అందించడం జరుగుతుందన్నారు. రెండు చోట్లా వైద్యశిబిరాలు ఏర్పాటు చేశామని, పారిశుధ్య సిబ్బందితో ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రం చేయిస్తున్నామన్నారు. వరద నీరు తగ్గుముఖం పడుతున్నందున ఘాట్లు శుభ్రంగా చేయించాలని పారిశుధ్య విభాగం అధికారులను ఆదేశించారు. ఆయన వెంట అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, మున్సిపల్ ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎ.వినూత్న ఉన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలకసంస్థలోని ప్రధాన మంచినీటి సరఫరా పైపులైన్‌కు మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం నగరంలో పలు ప్రాంతాలకు నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎస్ఈ పాండురంగారావు తెలిపారు. 1, 2, 3, 4, 5, 7 (సగభాగం), 8 (సగభాగం), 9 (సగభాగం), 10, 11, 37, 42 (సగభాగం), 43, 44, 50 డివిజన్లలో సరఫరా ఉండదన్నారు. ప్రాంతాల వారీగా రాజేంద్ర నగర్, సుబ్బారావు పేట, నెహ్రూనగర్, సైక్లోన్ కాలనీ, అద్దేపల్లి కాలనీ, బాబా నగర్, వెంకట్రామయ్య నగర్, నారాయణపురం, శారద నగర్, ప్రకాశం నగర్, కోకా భాస్కరమ్మ నగర్, బత్తిన నగర్, తారకరామయ్య నగర్, వీరభద్రపురం, లలితా నగర్, మున్సిపల్ కాలనీ, హరిపురం, ఆర్‌వీ నగర్, విద్యానగర్, సువిశేషపురం, మల్లికార్జున నగర్, వీవర్స్ కాలనీ, సంజీవ నగర్ పార్టు, ఇందిర సత్యనగర్ పుంత, పీఅండ్‌టీ కాలనీలో సగభాగం, చౌడేశ్వరి నగర్, రెవెన్యూ కాలనీ, ఎస్‌బీఐ కాలనీ, భాస్కర నగర్, గాంధీపురం– 4 ప్రాంతాలలో నీటి సరఫరా ఉండదన్నారు. ఈ ప్రాంతాలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

రిజర్వేషన్లకు ఆద్యుడు సాహు మహారాజ్

ప్రకాశం నగర్: రిజర్వేషన్లకు ఆద్యుడు సాహు మహారాజ్ అని, దేశంలో మొదటిసారిగా 1902 జూలై 26న రిజర్వేషన్ విధానాన్ని ఆయన ప్రవేశపెట్టారని పీపుల్స్ పార్టీ ఇండియా నాయకులు అన్నారు. గోదావరి గట్టు సమీపంలోని పూలే విగ్రహం వద్ద శుక్రవారం మూల్ ప్రాతినిధ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు నక్కా వెంకటరత్నం, ఆదినారాయణ మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్ తెగలు, ఇతర అట్టడుగు వర్గాలతో సహా వెనుకబడిన తరగతులకు 50 శాతం ప్రభుత్వ ఉద్యోగాలను రిజర్వ్ చేసిన ఘనత సాహు మహారాజ్‌కే దక్కుతుందన్నారు.

ఉన్నత భావాలను అలవర్చుకోవాలి

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్, రెడ్‌క్రాస్, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం రెడ్‌క్రాస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు మాట్లాడుతూ విద్యార్థులు చదువు కోవడంతో పాటు సమాజానికి మేలు చేసే ఉన్నత భావాలను కలిగి ఉండటమే రెడ్‌క్రాస్ ముఖ్య ఉద్దేశమన్నారు. రాజమండ్రి రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యురాలు డాక్టర్ మహాలక్ష్మి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ చరిత్ర, దాని సేవ కార్యక్రమాలను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజు మంచి పనులు చేయాలనే ఆలోచన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

డిజిటల్ బ్యాంకింగ్‌లో కెనరా బ్యాంక్ ఉత్తమం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జనరల్ మేనేజర్ రవివర్మ

రాజమహేంద్రవరం రూరల్: డిజిటల్ బ్యాంకింగ్ రంగంలో కెనరాబ్యాంక్ ఉత్తమమంటూ కేంద్ర ప్రభుత్వం ప్రశంసించిందని ఆ బ్యాంక్ విజయవాడ సర్కిల్ హెడ్, జనరల్ మేనేజర్ పి.రవివర్మ అన్నారు. బొమ్మూరులోని బాలాజీపేట రోడ్డులో శుక్రవారం ఆ బ్యాంక్ 57వ బ్రాంచ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖాతాదారుల సమావేశంలో జీఎం రవివర్మ మాట్లాడుతూ బొమ్మూరు, పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించడం కోసమే నూతన బ్రాంచ్‌ను ప్రారంభించామన్నారు. కెనరా బ్యాంక్ ద్వారా అందించే వివిధ రకాల రుణ పథకాలను వివరించారు. భీమవరం రీజియన్ రీజనల్ హెడ్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ తోట రవిచంద్ర మాట్లాడుతూ ఖాతాదారుల శ్రేయస్సు కోసం కృషి చేస్తున్నామని, కెనరా బ్యాంక్ సీఎస్‌ఆర్ నిధులతో ఆగస్టు 15న సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ ఎస్‌వీ నరసింహారావు, ఖాతాదారులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

శాకంబరిగా అమ్మవార్లు



20వ డివిజన్ కన్నమాంబ వీధిలో కనకదుర్గమ్మ



శాకంబరి అలంకరణలో పోలేరమ్మ

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట గ్రామంలోని పాత పోలేరమ్మగుడిలో కొలువైన అమ్మవారు శుక్రవారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢమాసం సందర్భంగా ఆలయ అర్చకుడు బాపిరాజు వివిధ రకాల కూరగాయాలతో అమ్మవారికి అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): 20వ డివిజన్ కన్నమాంబ వీధిలో కొలువైన కనకదుర్గమ్మను శుక్రవారం శాకంబరిగా అలకరించారు. కనకదుర్గ కమిటీ ఆధ్వర్యంలో పలు రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అలంకరణ చేశారు.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం



కూలిపోయిన చెట్టును తొలగిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది



రోడ్డుపై విరిగిపడిన విద్యుత్ స్తంభం

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో శుక్రవారం పెను ప్రమాదం తప్పింది. స్థానిక టీటీడీ కల్యాణ మంటపం రోడ్డులోని ఉమెన్స్ కాలేజీ సమీపంలో ఓ చెట్టు కూలిపోయింది. ఆ సమయంలో పక్కనే ఉన్న రెండు హెవీ ఎలక్ట్రికల్ విద్యుత్ స్తంభాలపై పడడంతో అవి కూడా విరిగి రోడ్డు మీద పడ్డాయి. ఈ ఆకస్మిక ఘటనతో అటుగా వెళుతున్న వాహన చోదకులు, పాదచారులు పరుగులు తీశారు. విద్యుత్ స్తంభాలు పడిన సమయంలో అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల సమాచారం మేరకు విద్యుత్‌శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. విరిగిన చెట్టును, కూలిన విద్యుత్ స్తంభాలను తొలగించారు. స్తంభాలు విరిగి పడుతున్న సమయంలో అటుగా వెళుతున్న రెండు కార్లు స్వల్పంగా దెబ్బతిన్నాయి.

వీడని ముంపు.. ఇళ్లల్లోకి నీరు



ఎంపీడీవో కార్యాలయం వద్ద ఓ ఇంటిలోకి చేరిన నీరు

రాజమహేంద్రవరం రూరల్: గోదావరి వరద ప్రవాహం తగ్గకపోవడంతో బొమ్మూరు, హుకుంపేట గ్రామాలలో శుక్రవారం కూడా ముంపు సమస్య వీడలేదు. ధవళేశ్వరం సాయిబాబాగుడి వద్ద భారీ మోటర్లతో నీటిని తోడుతున్నప్పటికీ నీరు పూర్తిస్థాయిలో లాగడం లేదు. అంతే కాకుండా హుకుంపేట ఎంపీడీవో కార్యాలయం ప్రాంతంలోని ఇళ్లల్లోకి నీరు వచ్చి చేరింది. పంచాయతీ అధికారులు బ్లీచింగ్ చల్లుతున్నప్పటికీ ప్రజలలో ముంపు సమస్య భయాందోళన వీడడం లేదు. రాష్ట్ర టీడీపీ వైద్య విభాగ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ హుకుంపేటలోని ముంపు ప్రాంతాలను పార్టీ నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆదేశాల మేరకు ప్రజల సమస్యలు తెలుసుకుని అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి గుంట్రు వెంకటరావు తదితరులు ఉన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



బొమ్మూరు పాఠశాలలో కార్గిల్ అమర వీరులకు నివాళులర్పిస్తున్న హెచ్ఎం నరసింహారెడ్డి, విద్యార్థులు



కడియపులంకలో మాజీ సైనికుడు సుబ్రహ్మణ్యాన్ని సత్కరిస్తున్న గ్రామస్తులు

రాజమహేంద్రవరం రూరల్: దేశ సరిహద్దుల్లో సైనికులు చేస్తున్న త్యాగాలు వెలకట్టలేనివని బొమ్మూరు జీపీఆర్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి అన్నారు. ఆ పాఠశాలలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులకు నివాళులర్పించారు. కార్గిల్ వీరులను స్మరిస్తూ ఉపాధ్యాయుడు సుబ్బయ్య చేసిన కవితా గానం విద్యార్థులలో స్ఫూర్తిని నింపింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కడియం: కడియపులంక హైస్కూల్లో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ ఘనంగా నిర్వహించారు. స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తుల భాగస్వామ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ మన దేశం కార్గిల్‌లో పాకిస్థాన్‌పై విజయం సాధించి 25 ఏళ్లు పూర్తయ్యిందన్నారు. మన సైనికుల సామర్థ్యం, త్యాగాలను మరువలేనివని కొనియాడారు. ఈ సందర్భంగా కడియపులంక గ్రామానికి చెందిన మాజీ సైనికుడు గంగుల సుబ్రహ్మణ్యాన్ని సత్కరించారు. కార్యక్రమంలో కరటూరి శ్రీనివాస్, ఒంటెద్దు స్వామి, కొటికలపూడి వెంకటేశ్వరరావు, బోరుసు సుబ్రహ్మణ్యం, చిక్కాల శ్రీనివాస్, నాగులపల్లి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలి

పెదపూడి: పాఠశాలల్లో విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపర్చాలని విద్యాశాఖ పాఠశాల ఆర్‌జేడీ నాగమణి అన్నారు. ఏపీత్రయం గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆమె శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పలు రికార్డులు పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థులతో సబ్జెక్టుల వారీగా విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. విద్యార్థుల సమాధానాలతో ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు బహుమతి ప్రోత్సాహకాలు అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 సీవీవీ సత్యనారాయణ, హెచ్ఎం రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కలిగిస్తున్న దృశ్యం

రాజానగరం: రాజమహేంద్రవరంలోని డెల్టా ఆస్పత్రి సహకారంతో స్థానిక గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు కార్డియో పల్మనరీ రీసిస్టియేషన్ (సీపీఆర్)పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీపీఆర్ గురించి, దాని ఎవ్వరికి, ఎప్పుడు చేయాలో ఎండీ డాక్టర్ కె.నాగేశ్వరరావు వివరించారు. ప్రమాదానికి గురైన మనిషి స్పృహ కోల్పోతే, ఆ సమయంలో అందించాల్సిన ప్రాథమిక చికిత్సపై అవగాహన కలిగించారు. డాక్టర్ నితిన్ మాట్లాడుతూ ఇన్నోవేషన్ సర్జికల్ టెక్నాలజీలో వచ్చిన ఆధునిక పోకడలను, వెరికోస్ (ఉబ్బిన సిరలు) లక్షణాలు, చికిత్స పద్ధతులను తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రన్, ఎన్ఎస్ఎస్ పీఓ షేక్ మీరా తదితరులు పాల్గొన్నారు.

చురుకుగా కుష్ఠువ్యాధి నిర్ధారణ సర్వే



మిర్తిపాడులో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

సీతానగరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ఏవీకే చైతన్య ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలో కుష్ఠువ్యాధి నిర్ధారణ సర్వే నిర్వహించారు. లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ కార్యక్రమం భాగంగా జరిపిన ఈ సర్వేలో 130 మంది అనుమానితులను గుర్తించారు. వారికి వైద్య పరీక్షలు జరపగా వారిలో ఇద్దరికి వ్యాధి నిర్ధారణ అయ్యింది. వారికి ఇంటి వద్దే ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ చైతన్య మాట్లాడుతూ మండలంలో 36,792 మందిని సర్వే చేసినట్టు తెలిపారు. ఒంటిపై ఏ విధమైన మచ్చలు ఉన్నా ఆరోగ్య సిబ్బందికి తెలియజేయాలన్నారు.

సినిమాలు



శ్యామల	రాయన్
సూర్యమినీ	డెడ్‌పూల్ అండ్ వోల్వరిన్
సూర్యప్యాలెస్	రాయన్
స్వామి	డెడ్‌పూల్ అండ్ వోల్వరిన్
అశోక	కల్కి 2898ఏడి
శివజ్యోతి	డెడ్‌పూల్ అండ్ వోల్వరిన్
అనుశ్రీ	డార్లింగ్
రంభ	పురుషోత్తముడు
ఊర్వశి	భారతీయుడు-2
మేనక	డెడ్‌పూల్ అండ్ వోల్వరిన్
కుమారి	ఆపరేషన్ రావణ్
అప్సర	డెడ్‌పూల్ అండ్ వోల్వరిన్
నామవరం	
వీఎస్ మహల్	రాయన్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	రాయన్
	డెడ్‌పూల్ అండ్ వోల్వరిన్
కడియం	
వెంకటసూర్య	రాయన్, డెడ్‌పూల్ అండ్ వోల్వరిన్